ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 261
ఆదివారం 04 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

"వై నాట్ పులివెందుల" – కూటమి గర్జన, జగన్ హై అలర్ట్!



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 03)
స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఏపీలో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ముఖ్యంగా గత స్థానిక ఎన్నికల్లో వైట్ వాష్ కు గురైన ప్రస్తుత అధికార కూటమి ఇప్పుడు విపక్షానికి అదే పరిస్థితి తీసుకురావాలని పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వైనాట్ పులివెందుల అంటూ నినదించడమే కాకుండా, విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంలో మెజార్టీ సీట్లను గెలుచుకునే వ్యూహంతో పనిచేస్తోందని చెబుతున్నారు. గతంలో జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, వైనాట్ 175, వై నాట్ కుప్పం అంటూ నినాదాలు చేసేవారు. ఇప్పుడు కూటమిలో ముఖ్యనేతలు ఆ విధమైన ప్రకటనలు చేయకపోయినా, పులివెందులలో జగన్మోహనరెడ్డికి ఓటమి రుచి చూపించాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నట్లుగా సంకేతాలు పంపుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ఇప్పటివరకు ఆయన కుటుంబానికి ఎదురులేకుండా పోయింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా ఈ నియోజకవర్గంలో పోటీపై పెద్దగా దృష్టి పెట్టేవారు కాదని చెబుతున్నారు. జగన్మోహనరెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన నుంచి పులివెందుల నియోజకవర్గం ఆ కుటుంబానికి కంచుకోటగా ఉండగా, వైఎస్ ఆ తర్వాత జగన్ రెడ్డి చెప్పిన వారికే స్థానిక పదవులు దక్కేవి. అయితే గత ప్రభుత్వంలో జగన్మోహనరెడ్డి అనుసరించిన విధానాలు కారణంగా ప్రతిపక్ష నేతలకు బలమైన స్థానాల్లో కూడా ఆయా పార్టీలు పోటీ చేసే వాతావరణం లేకుండా పోయిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఎన్నికల్లో అలాంటి వాతావరణం ▶2లో

3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన...


నేడు తెనాలికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 03)
రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి రేపు (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు ▶2లో

పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది

ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే: ఖర్గే



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 03)
ప్రస్తుత లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఆయా ఎన్నికలన్నీ చట్టవిరుద్ధంగా జరిగాయని, వాటిని రద్దు చేసి.. బ్యాలెట్ పేపర్ విధానంలో మరోసారి పోలింగ్ నిర్వహించాలని అన్నారు. కర్ణాటకలోని కలబురిగిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈవీఎంలను దుర్వినియోగం చేస్తున్నట్లు అధికార పార్టీకి చెందిన నేతలే చెబుతున్నారని చెప్పారు. చట్ట విరుద్ధంగా ఎన్నికైన వాళ్లే ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నారని ఆక్షేపించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవ రణ ప్రక్రియలో అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని ఖర్గే విమర్శించారు. 'సర్' పేరుతో కేంద్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. 'సర్'కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతాయని చెప్పారు. ఒక్కో బూత్ నుం చి దాదాపు 500 ఓట్లను తొలగిస్తున్నారని, అలా జరిగితే..అది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నిక ఎలా అవుతుందని ఖర్గే ప్రశ్నించారు. భాజపా, ఆరెస్సెస్‌కు చెందిన కార్యకర్తలు ప్రతి గ్రామానికి వెళ్లి వ్యతిరేక వర్గానికి చెందిన ఓట్లను దగ్గరుండి తొలగిస్తున్నారని ఆరోపించారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు



హోదాతో గుర్తింపు తెచ్చుకునేవారు కొందరు... కానీ తమ వ్యక్తిత్వంతో హోదాకే గౌరవం తెచ్చేవారు అరుదు. అలాంటి అరుదైన వ్యక్తిత్వం
"శ్రీ యార్లగడ్డ నరసింహారావు గారి ది"
సబ్ రిజిస్టర్ గా పదవీ విరమణ చేస్తున్నది
మీ పదవికే కానీ, మా హృదయాల్లో మీ స్థానం కి కాదు...

శ్రీ యార్లగడ్డ నరసింహారావు గారు

Sridhar Yarlagadda - CEO
PRASEEDA advertising
CLICK TV ప్రతీవార్త ప్రజాహితం...

రైతుల భూ హక్కులకు భరోసా



(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 3)
రైతుల భూ హక్కులకు భరోసా కల్పించడంతో పాటు భూ రికార్డులను పారదర్శకంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. శనివారం బుర్లవారిపాలెంలో నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. రీసర్వే, భూ రికార్డుల పరిశీలన అనంతరం అర్హులైన రైతులకు పాసుపుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పాసుపుస్తకాల్లో నమోదైన వివరాలను రైతులు పరిశీలించుకోవాలని, తప్పులు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల విధుల కేటాయింపులో యాజమాన్యం పారదర్శకత పాటించాలి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 3)
ఆర్టీసీ ఉద్యోగుల విధుల నిర్వహణలో ఏర్పాటుచేసే చార్టల విషయంలో పారదర్శకత పాటించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం డిపో ఆవరణలో గేట్ మీటింగ్ కార్యక్రమం నాయకులు ఎండి అబ్దుల్ బాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీలు వేసే విషయంలో అధికారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారన్నారు. అంతేకాక గ్యారేజ్లో మెకానిక్ల చార్టులలో పారదర్శకత లోపించిందని వీటి విషయంలో న్యాయపరంగా విధుల కేటాయింపు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ పి ఓబులేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండలరావు, రీజనల్ నాయకులు వెంకటరావు, పిఎన్ రెడ్డి, డిపో ముఖ్య నాయకులు, మహిళా ఉద్యోగులు, గ్యారేజ్ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గుర్రం ఆల్ఫ్రెడ్ క్రికెట్ ఫౌండేషన్ కు చెందిన క్రీడాకారులు ఎంపిక



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 3)
ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ప్రకాశం ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 బాలుర క్రికెట్ ఎంపికలో విశ్వభారతి ఐఐటి ఫౌండేషన్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న పి ఉమర్ ఖాన్, రఘుపతి, నవదీప్ రాయల్, అండర్ 19 బాలికల క్రికెట్లో నారాయణ హై స్కూల్లో చదువుతున్న బి గాయత్రి, మనస్విని, తేజస్విని, ఆర్ఆర్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న షేక్ అర్షియా, అండర్ 17 బాలికల క్రికెట్లో జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాల గిద్దలూరు నందు 8వ తరగతి చదువుతున్న షేక్ కరిష్మా ఎంపికైనట్లు గుర్రం ఆల్ఫ్రెడ్ క్రికెట్ ఫౌండేషన్ హెడ్ కోచ్ జి శోభన్ బాబు, కోచ్ డి మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.



మొదటిపేజీ తరువాయి

"వై నాట్ పులివెందుల" - కూటమి గర్జన, జగన్ హై అలర్ట్!

లేకపోయినా ప్రజాస్వామ్యయుతంగానే పోరాడి వైసీపీని ఓడించాలని కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు.గత ఏడాది జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అనూహ్య విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ రాలేదు. దీంతో గట్టిగా ప్రయత్నిస్తే పులివెందుల నియోజకవర్గంలో మెజార్టీ నియోజకవర్గాలను కైవసం చేసుకోవచ్చునని టీడీపీ కూటమి ప్లాన్ చేస్తోందని అంటున్నారు. ప్రధానంగా వైఎస్ ఫ్యామిలీకి తిరుగులేని బలం ఉన్న పులివెందుల నగర పంచాయతీలో పసుపు జెండా ఎగరవేయాలనే వ్యూహంతో టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీలో ఉన్న కొందరితో చర్చలు సాగిస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కూడా స్వయంగా రంగంలోకి దిగినట్లుగా చెబుతున్నారు.

జగన్ రెడ్డి ఫోకస్

అధికార పార్టీ 'వై నాట్ పులివెందుల' అంటుండటంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అలర్ట్ అయ్యారని చెబుతున్నారు. ప్రతిపక్ష నేతల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న మాజీ సీఎం జగన్ రెడ్డి పార్టీ శ్రేణులు చేయిదాటిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి దిశానిర్దేశం చేశారని అంటున్నారు. అదేసమయంలో ముఖ్యమైన కార్యకర్తలతో జగన్ రెడ్డి స్వయంగా మాట్లాడుతూ అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దని, తాను ఉన్నానని భరోసా ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఇక జగన్ రెడ్డి సూచనలతో ఎంపీ అవినాశ్ రెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, వైసీపీ ముఖ్యనేతలు నియోజకవర్గంలో పట్టు సడలకుండా పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. దీంతో పులివెందుల రాజకీయం హాట్ హాట్ గా మారిందని చెబుతున్నారు.

3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన...

మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి.

పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా, తక్కువ శ్రమతో నిర్మాణం పూర్తి చేయడం, నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నాణ్యత, పటిష్ఠతను పెంచడం సాధ్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:35 గంటలకు బుర్రిపాలెం చేరుకుంటారు. ఉదయం 10:40 గంటలకు 3డీ ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11:10 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1:35 గంటలకు తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

విద్యార్థులు సమాచార నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)
స్థానిక ఒంగోలులోని ఆదిత్య డిగ్రీ కాలేజీ ఆవరణలో శనివారం ఉదయం బిబిఎ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఫెస్టును నిర్వహించారు.ఈకార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ పి.సంతోష్ సభాధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర బ్యాంకు విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ కవి యువి రత్నం ప్రసంగిస్తూ "కమ్యూనికేషన్ స్కిల్స్", వ్యక్తిత్వ వికాసం గురించి, బ్యాంకు ఉద్యోగులను ఎలా సాధించవచ్చో తెలియజేశారు. మన భావాలను,సమాచారాన్ని లేదా ఆలోచనలను ఇతరులకు సమర్థవంతంగా మరియు స్పష్టంగా తెలియజేయగల సామర్థ్యమని,ఇది కేవలం మాట్లాడటమే కాకుండా, ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా వినడం ద్వారా కూడా సాధ్యపడుతుందని,సంభాషణల్లో ఇవి చాలా ముఖ్యమని తెలిపారు.అంతేకాకుండా మాటల ద్వారా, ప్రసంగాల ద్వారా మన భావాలను వ్యక్తపరచడం. ముఖ కవళికలు, హావభావాలు, శరీర భాష, కంటి చూపు ద్వారా భావాలను తెలపడం,వ్రాతపూర్వక సంభాషణ ద్వారా సమాచారాన్ని రాయడం,శ్రద్ధగా వినడం, ఎదుటి వ్యక్తి చెప్పేది ఓపికగా, అర్థం చేసుకునేలా వినడం అనేవి మనల్ని మనం అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడతాయని తెలియజేశారు. ఫెస్ట్ ముగింపు వేడుకలకు విచ్చేసిన ఎస్బిఐ బ్యాంక్ విశ్రాంత ఏజియం గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మేనేజ్మెంట్ విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా విభిన్న రంగాలలో లక్షలాది ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, సాధారణంగా మేనేజ్మెంట్ పూర్తి చేసిన అభ్యర్థులను కంపెనీలు మేనేజ్మెంట్ ట్రైనీ లేదా అసోసియేట్ స్థాయి హోదాల్లో నియమించుకుంటాయని, విద్యార్థులు తమ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంచుకో గల ముఖ్యమైన స్పెషలైజేషన్ల వారీగా ఉద్యోగాలు గురించి వివరణాత్మక, విశ్లేషణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ మాట్లాడుతూ మార్కెటింగ్ సేల్స్ అండ్ బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, బ్రాండ్ మేనేజర్, డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్ మరియు కస్టమర్ రిలేషన్షిప్ మేనేజర్, ఫైనాన్స్ ఫైనాన్షియల్ అనలిస్ట్, ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకింగ్ అసోసియేట్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, క్రెడిట్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్, బిజినెస్ అనలిస్ట్, మేనేజ్మెంట్ కన్సల్టెంట్, ఐటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, తదితర ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ బి కోటేష్, మేనేజ్మెంట్ కోర్సు శాఖాధిపతి డాక్టర్ పి శ్రీనివాసులు, తెలుగు శాఖాధిపతి డాక్టర్ నూనె అంకమ్మరావు, కామర్స్ ఫ్యాకల్టీ యం హీనాల పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా సెమినార్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, బిబిఎ కోర్సు విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం పఠాన్ నాగూర్ వలి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 3)



మహాత్మా గాంధీ అనుసరించిన అనేక మార్గాలను విశ్వసించి, పల్నాటి గాంధీగా పేరుగాంచిన మాజీ పార్లమెంటు సభ్యులు, రొటేరియన్ స్వర్గీయ కోటా సైదయ్య స్మారక గాంధీ జయంతి వేడుకలు స్థానిక కెసిపి వెలగపూడి లక్ష్మణ్ దత్ ఆడిటోరియం నందు గత రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు జాతీయత భావాలు, దేశభక్తిని పెంపొందించేందుకు వివిధ రూపాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. భారతదేశ స్వతంత్ర కోసం పోరాడిన వీరుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ఫాన్సీ డ్రెస్సులు, నృత్యాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ముందుగా మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి,కోటా సైదయ్య చిత్రపటాలకు పూలమాలలను సమర్పించి, రోటరీ అన్స్ మహిళలచే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి మార్గాలలో నడిచిన గాంధీజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, విద్యార్థులలో ఆ మార్గాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోట హనుమంతరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్స్ ఇక్కుర్తి శంకర్, తిర్లిక శ్రీనివాసరావు, రోటరీ ట్రస్ట్ ట్రెజరర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, కార్యదర్శి డాక్టర్ మూడవ దశరథ్ చౌహన్, ట్రెజరర్ అవుల

భాద్రపద మాస మూడవ శనివారం వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 3)
బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సుమిత్రానగర్లో వెలిసిన మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి మరియు అభయ




అంజనేయ స్వామి దేవాలయంలో భాద్రపద మాస మూడవ శనివారం సందర్భంగా వేంకటేశ్వర స్వామివారికి విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరేశచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చనలు, పలు రకాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక అభిషేక దాతలుగా వెంకటేశ్వర్లు, సతీమణి మహాలక్ష్మి కుటుంబ సభ్యులు, గోపాల కృష్ణ, సతీమణి రాజేశ్వరి కుటుంబ సభ్యులు, రఘు రామయ్య, సతీమణి కనక దుర్గ కుటుంబ సభ్యులు, మాలేపాటి సునీల్ కుమార్, సతీమణి నవలత కుటుంబ సభ్యులు, సముద్రాల రాజేంద్ర ప్రసాద్, సతీమణి సౌజన్య కుటుంబ సభ్యులు, వల్లంకోడు శివ కుమార్, సతీమణి పుష్పలత కుటుంబ సభ్యులు, కొండారెడ్డి, సతీమణి సుభాషిణి కుటుంబ సభ్యులు, తొడేటి సుబ్బయ్య, సతీమణి తిరుపతమ్మ కుటుంబ సభ్యులు, లక్ష్మీదేవి, కుమారుడు మురళి కుటుంబ సభ్యులు, పాపిశెట్టి వీరాంజనేయులు, సతీమణి రాజేశ్వరి కుటుంబ సభ్యులు ఉన్నారు. అదే విధంగా ప్రత్యేక ఉభయదాతలుగా ఆదినారాయణ, సతీమణి సౌజన్య కుటుంబ సభ్యులకు ఆలయ నిర్వహకులు వల్లంకొండు వెంకటరమణ, కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.






ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
04.10.26 ఆదివారం

కలెక్టర్‌కే తెగబడి అబద్ధాలు చెప్పిన తహశీల్దార్ జయలక్ష్మి

ఆర్‌టిఐ సమాచారంతో అడ్డంగా బుక్ అయిన తహశీల్దార్

ఎఫ్‌డిఐఎస్ నెంబర్ లేకుండా పొజిషన్ సర్టిఫికేట్లు జారీ

సర్వే నెం.634/ఏ లో అడుగడుగునా అక్రమాలే

రోడ్డున పడ్డ రెవిన్యూ శాఖ

ఆ పొజిషన్ సర్టిఫికేట్‌తో మాకు సంబంధం లేదు

ప్రస్తుత తహశీల్దార్ కృష్ణ ప్రసాద్

మళ్ళీ హైకోర్టుకు వెళుతున్న స్థానికులు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 3)


మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతకు ఒకప్పటి కనిగిరి తహశీల్దార్ నర్రా జయలక్ష్మి తెగబడి మరీ అబద్ధాలు చెప్పింది. ఆర్‌టిఐ సమాచారంతో ఆమె అడ్డంగా బుక్ అయ్యింది. ఎఫ్‌డిఐఎస్ నెంబర్ లేకుండా పలువురికి పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.....కనిగిరిలోని పామూరు రోడ్డులో గల సర్వే నెం. 634/ఏ లో అడుగడుగునా అక్రమాలే జరుగుతున్నాయి. సదరు భూమిలో బత్తుల వెంకటేశ్వర్లు కుటుంబానికి పట్టా ఇచ్చియున్నారు. అయితే ఆ భూమి పై కొందరు ఫిర్యాదు చేయడంతో 2023లో అప్పటి తహశీల్దార్ వి పుల్లారావు 60 సంవత్సరాల నుండి బండారు వెంకటేశ్వర్లు కుటుంబీకులు సాగులో ఉన్నారని కనిగిరి పోలీసులకు లిఖితపూర్వక నివేదిక ఇచ్చారు. ఆ భూమి బండారు వెంకటేశ్వర్లు ఆధీనంలో ఉందని అప్పటి తహశీల్దార్ 2023లో నివేదిక ఇవ్వగా 12 ఏళ్ళుగా కొందరి ఆధీనంలో ఉన్నదని ఇటీవల బదిలీ పై వెళ్ళిన తహశీల్దార్ నర్రా జయలక్ష్మి పలువురికి పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చారు. ఒక్కో ప్లాటు రూ.10 లక్షలు విలువ చేస్తుందని నర్రా జయలక్ష్మి మనకు గిఫ్ట్‌గా ఇచ్చిందని ఓ విలేకరి 18 మంది విలేకరులకు ఇంటింటికి తిరిగి పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చారు. అయితే ఆ పొజిషన్ సర్టిఫికేట్ల పై ఎఫ్‌డిఐఎస్ నెంబర్ కూడా లేదు. కనిగిరి రెవిన్యూ కార్యాలయ రికార్డుల్లో నేటికీ నమోదు కాలేదు. పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చిన నర్రా జయలక్ష్మి మే 11న కనిగిరి జర్నలిస్టులు కొందరు పొజిషన్ సర్టిఫికేట్ల పై జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతకు లిఖిత పూర్వకంగా అర్జీ నెంబర్ 178 ద్వారా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ విజయ సునీత అక్కడే ఉన్న తహశీల్దార్ నర్రా జయలక్ష్మిని ఇదేంటని ప్రశ్నించగా తాను ఎటువంటి పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వలేదని స్పందనలో కలెక్టర్‌కు స్పష్టం చేశారు. అంతే గాక ఓ విలేకరి సర్వే నెం.634/ఏలో ఏమైనా పొజిషన్ సర్టిఫికేట్లు, ఇంటి పట్టాలు గాని ఇచ్చారా అని ఆర్‌టిఐ ద్వారా సమాచారం కోరగా 04.06.2026న తాము ఎటువంటి పొజిషన్ సర్టిఫికేట్లు గాని, పట్టాలు గాని ఇవ్వలేదని లిఖితపూర్వక సమాచారం ఇచ్చారు. కానీ ఈ ఏడాది ఏప్రియల్ 29న తహశీల్దార్ నర్రా జయలక్ష్మి ఇచ్చిన పొజిషన్ సర్టిఫికేట్లు బహిర్గతమయ్యాయి. 12 ఏళ్ళుగా పొజిషన్‌లో ఉన్నట్లు తహశీల్దార్ పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వడం ఆశ్చర్యాన్ని గురి చేస్తుంది. మున్సిపాల్టీ పరిధిలో జీఓఎంఎస్ నెం. 546 ప్రకారం పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చే అధికారం తహశీల్దార్‌కు లేదని తెలియజేస్తుంది. ఆర్డీఓ మాత్రమే వాగులు, వంకలు, కంప పోరంబోకులు కాకుంటే పొజిషన్ సర్టిఫికేట్లు ఇచ్చే అధికారం ఆర్డీఓకు ఉంటుంది. కానీ 634/ఏ రెవిన్యూ రికార్డుల ప్రకారం డొంక పోరంబోకు భూమి... ఎఫ్‌డిఐఎస్ నెంబర్ లేకుండా రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయకుండా తహశీల్దార్‌కు అధికారం లేకుండా ఇచ్చిన పొజిషన్ సర్టిఫికేట్లు నకిలీవిగా భావించాలని రెవిన్యూ అధికారులు అంటున్నారు. ఆ పొజిషన్ సర్టిఫికేట్ల పై ఆ సర్వే నెంబర్ కు సంబంధం లేని విఆర్ఓ సంతకం ఉండడం కూడా విశేషం... ఆర్ఐ, డిటిల సంతకాలు ఉన్నప్పటికీ అవి వారి సంతకాలని నిర్ధారించలమేని రెవిన్యూ అధికారులు చెబుతున్నారు. కనిగిరి రెవిన్యూ కార్యాలయంలో సర్వే నెం.634/ఏకు సంబంధించి ఎటువంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికేట్లు లేవని, దానికి సంబంధించిన ఫైల్ మా కార్యాలయంలో లేదని ప్రస్తుత తహశీల్దార్ కృష్ణ ప్రసాద్ వెలుగు ప్రతినిధికి తెలిపారు.


సర్వే నెం. 634/ఏ పై కలెక్టర్ ప్రత్యేక విచారణ చేపట్టాలి


సర్వే నెం. 634/ఏ పై అడుగడుగునా అక్రమాలు జరిగాయని, ఈ సర్వే నెంబర్‌లో జరుగుతున్న అక్రమాల పై జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తక్షణమే ప్రత్యేక అధికారితో సమగ్ర విచారణ జరపాలని ప్రజా హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు డి మల్లిఖార్జున రావు కోరారు. లేని అధికారంతో తహశీల్దార్ నర్రా జయలక్ష్మి పొజిషన్ సర్టిఫికేట్‌లు ఇచ్చి కనిగిరిలో రెవిన్యూ శాఖను రోడ్డు మీద పెట్టిందని ఆయన ఆరోపించారు. ఈ సర్వే నెంబర్లలో జరిగిన అక్రమాల పై ఈ ఏడాది మే 11న తాను జిల్లా కలెక్టరు ఫిర్యాదు చేశానని అయితే ఆ ఫిర్యాదును ఆన్‌లైన్ కాకుండా చేసిన ఘన చరిత్ర కూడా తహశీల్దార్ నర్రా జయలక్ష్మిదేనన్నారు. సర్వే నెం.634/ఏలో జరిగిన అక్రమాల పై జర్నలిస్టుల తరుపున నర్రా జయలక్ష్మితో పాటు ఇతర అధికారు ల పై హైకోర్టుకు వెళ్ళనున్నట్లు ఆయన తెలిపారు.


షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక


సర్వే నెం.634/ఏ లో అరాచకం


2024లో అక్రమ నిర్మాణాలు అక్రమం-ఇప్పుడు సక్రమం
చోద్యం చూస్తున్న అధికారులు
కనిగిరి రెవిన్యూ, మున్సిపల్ శాఖలో కల్లున్న కబోదుల్లా అధికారులు
ప్రభుత్వంతో ప్రతి పల్లెలో పండగ వచ్చింది
అభ్యర్థి ఎవరైనా సరే


నివేశన స్థల సర్వీసు ధృవీకరణ పత్రము
TAHSILDAR
KANIGIRI MANDAL
MARKAPURAM (DIST)



To
The Sub-Inspector of Police,
Kanigiri P.S.
Rc.DT/11/2023, dated.../01/2023
Sub:- Land disputes - Kanigiri Mandal - Shankavaram Village - Machavaram Hamlet -Sy.No.634/A measuring an extent of Ac.2.18 cents - Present possession and real owner of the land furnished - Regarding.
Ref:- 1. Report of the Ward Revenue Secretary, 9th Ward, Kanigiri Municipality and Mandal, dated.10.04.2023.
2. Statement of Machavaram Villagers,dt.20.03.2023.
3. Representation of Sri Bandaru Venkateswarlu S/o. Chinna Kondayya, dt.20/03/2023.
In the reference 3rd cited, Sri Bandaru Venkateswarlu S/o. Chinna Kondayya has represented that his family has been in possession and cultivating agricultural land for an extent of Acs. 2:18 Cnts. in Sy.No.634/A for the past 60 years and that now, seme people trying to threaten him by producing fake documents.
2. In this connection, I have directed MRI & VRO, Shankavaram to enquire and submit report in the matter. Accordingly, they have submitted their reports. As seen from their reports and revenue records, the said land in Sy.No.634/A measuring an extent of Acs. 2:18 Cnts. is dotted land as per RSR. There are no entries as per 1A and 1B registers. Further, as per the Adangal for Fasli 2011-12, the land was Anadheenam land and in the weblandt, it was recorded as Donka land.
3. However, as per the field inquiry, Sri Bandaru Venkateswarlu S/o. Chinna Kondayya has been cultivating the land to an extent of Acs. 2:18 Cnts. in Sy.No.634/A since their ancestors and presently raised Red Gram crop. Further, the hamsaidars and villagers of the Machavaram Village stated that Sri Bandaru Chinna Kondayya S/o. Chenchayya has been cultivating the said land in Sy.No.634/A for nearly 60 years and after his demise, his son Sri Bandaru Venkateswarlu has been in possession of the land and cultivating the said land in since then.
4. This report is for information and taking further necessary action in the matter.
Yours faithfully,
Tahsildar
Scanned with OKEN Sca


Mandal Revenue Officer
KANIGIRI.
Divisional Officer
KANDUKUR.
19 NOV 1995


D. పమూనా
Fdis 174/1402 లాలి 16-6-92
ఈ పిలిచి చూపుటకై మీరు పెట్టుకున్న ధరఖాస్తు అంగీకరించబడినదనియు, ఆ చూపులు మీకు దిగువ తమాయించి చేయుటకై మీరు ఈ క్రింది నిబంధనలను ఒకవేళ మంజూరు అక్షరములలోగాని సంఖ్యలలోగాని ప్రమిక్కుటుంగా లోబడి మంజూరు చేయుటకు తీసుకుంటున్నది.
గ్రామము పేరు శంఖవరం సర్వే నెంబరు : 634/A విస్తీర్ణము : 2-18
నంబరు ఫొటోలు
లేక పాసుబుక్ నంబరు
1. మంజూరు చేయబడిన భూములు పంచకోసమేగాని మంజూరు చేయబడిన భూములు స్వయముగా సాగులోకి తెచ్చుకొనవలెను.
2. మంజూరు అక్షరాలతో తేదిమంది మూరు పంచకర్షణములలోగా మంజూరు చేయబడిన భూములు స్వయముగా సాగులోకి తెచ్చుకొనవలెను. లేనిచో మంజూరు రద్దుచేయబడును.
3. భూములు సాగులోకి తెచ్చుకొనుటకై గాని లేక ఇతర కుటుంబములోగాని వారితో గాని లేక పట్టాదారు మొత్తి గాని ఆకు కుటుంబములోని వారియొక్కగాని పేర్లతోగాని మీరు మరొక వ్యక్తులకు మొదట మూరు సంవత్సరములు భూమిని అమ్మడము, దానము చేయడము, తనఖా పెట్టడము, కౌలుకు ఇవ్వడము, ఇతరులకు బదలాయించడము, వారసులు ప్రభుత్వము పిలిచే పొందుటకు వీలులేదు.
4. భూమిని సాగుచేసుకొనుటకు మీ పిలకమువల్ల పిల్లాపాపలకు, వారసులకు ఇవ్వడానికి తప్ప ఇతరులకు ఇవ్వడానికి వీలులేదు. ఇతరులకు ఇవ్వడము, అమ్మడము, దానము చేయడము, తనఖా పెట్టడము, కౌలుకు ఇవ్వడము వీలులేదు.
5. భూమిని సాగుచేసుకొనుటకు మీరు ఎవరికైనా కౌలుకు ఇవ్వడానికి వీలులేదు. ఇతరులకు ఇవ్వడము, అమ్మడము, దానము చేయడము, తనఖా పెట్టడము, కౌలుకు ఇవ్వడము వీలులేదు.
6. భూమిలోనుండి ప్రభుత్వమునకు పన్నులు చెల్లించుటకు మీరు బాధ్యులు కారు.
7. మంజూరు చేయబడిన భూములలో ఏవిధంగానైనా ఖనిజములకు సంబంధించిన విలువగల ఖనిజములు లభించినచో ఆ భూమిని ప్రభుత్వమునకు స్వాధీనపరచవలెను. ఇందుకు మీకు ఎటువంటి నష్టపరిహారము చెల్లించబడదు.
8. సైకిల్ పెట్టుందుకు నాలుగు చక్రాల బండి పోవుటకు వీలుండునట్లుగా ఒక దారిని మీ భూమిపై వదలుటకు ప్రభుత్వము భూమిలో ఏర్పాటు చేసినచో ఆ దారిని మీరు అడ్డుకోకూడదు.
9. ఈ భూమిలోనుగాని, ఇతరులకు ఇవ్వబడిన భూములలోగాని ఇతరులు ఇబ్బందులు కలుగజేసినచో ఆ విషయమును ప్రభుత్వమునకు తెలియజేసి ప్రభుత్వము ద్వారా ఆ ఇబ్బందులను తొలగించుకొనవలెను.
10. ఈ భూమిలో గల చెట్లను ప్రభుత్వము అనుమతి లేకుండా నరకరాదు.
11. మంజూరు చేయబడిన భూమిలో వేసుకున్నయిను తరువాత పెరిగిన కొబ్బరిచెట్లు, కొమ్మలను ప్రభుత్వము ఎప్పుడు కావలసినా నరుకుటకు, వేళ్ళను తవ్వుటకు వీలు ప్రభుత్వమునకు ఉంటుంది. ఇందులో ఎటువంటి అభ్యంతరము లేదు.

స్థానిక ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పై దృష్టి పెట్టాలి

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 3)

స్థానిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల పై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం సంబంధిత అధికారులతో ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయి అధికారులను ప్రస్తుతం అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులుగా నియమించినందున తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకోసం అన్ని పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో 27 జడ్పిటిసిలు, 373 ఎంపీటీసీలు, 517 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిపించాల్సి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి రావాల్సిన సామగ్రి వచ్చినందున, స్థానికంగా సమకూర్చుకోవాల్సిన సామాగ్రి కోసం ▶మిగతా 4లో


MARKAPURAM DISTRICT

ఎన్నికల సన్నాహక చర్యలను పకడ్బందీగా చేపట్టాలి

మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 3)

జిల్లాలో 2026లో నిర్వహించనున్న రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు సన్నాహక చర్యలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. శనివారం మార్కాపురం కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్ల పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, జిల్లా రెవిన్యూ అధికారి ఎం శ్రీదేవి, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి ▶మిగతా 4లో

పొదిలి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

మర్యాదపూర్వకంగా కలిసి ఎస్పీని సత్కరించిన పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ సభ్యులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 3)

రానున్న ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా శనివారం పొదిలి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు చేపట్టారు. పొదిలి పోలీస్ స్టేషన్‌తో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను జిల్లా ఎస్పీ తిరిగి పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డ్స్‌ను పరిశీలించి కేసుల నమోదు, వాటి యొక్క స్థితి గతులను తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల గురించి ఆరాదిశారు. పొదిలి సిఐ ఎం రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్ లకు తగు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖ పై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలన్నారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల నిమిత్తం సిబ్బందికి కేటాయించిన గ్రామాలలో సమాచారాన్ని క్షేత్రస్థాయిలో సేకరిస్తూ ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేయాలని సూచించారు. తొలుత స్టేషన్‌లోని కానిస్టేబుళ్ళ పేర్లను అడిగి తెలుసుకుని వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పొదిలి సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ను పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి కలియుగదైవం వేంకటేశ్వరస్వామి వారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మీడియా ప్రతినిధులుగా మీరు మంచి సహాయ, సహకారాలు అందించాలన్నారు. ఎస్పీని సత్కరించిన వారిలో పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చప్పిడి శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరి ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్, కోశాధికారి ముల్లా హసన్ వలి(బడే), అశోక్ బండి తదితరులు ఉన్నారు.


MARKAPURAM POLICE



స్థానిక ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పై దృష్టి పెట్టాలి



చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, మున్సిపాలిటీల విషయంలో కందుకూరు మినహా ఇతర అన్ని మున్సిపాలిటీలో అవసరమైన చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు సమర్థంగా చేయడం ద్వారా ఈ ప్రక్రియను విజయవంతంగా సగం పూర్తి చేసినట్లు అవుతుందన్నారు. అందుకే రెగ్యులర్ విధులతోపాటు ఎన్నికల విధులకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, మండలాల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఎన్నికల సన్నాహక చర్యలను పకడ్బందీగా చేపట్టాలి

అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, పోలింగ్ కేంద్రాల పరిస్థితి, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను ముందుగానే పరిశీలించి అవసరమైన చోట్ల మెరుగుపరచాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి ప్రాథమిక సౌకర్యాలు, ఓటర్లకు అందుబాటులో ఉండే విధానం వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలన చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వివరాలను సిద్ధం చేయడంతో పాటు, వారికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన రికార్డులు, సామగ్రి, సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలను అధికారులు పూర్తిగా అవగాహన చేసుకుని వాటికి అనుగుణంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఫణీంద్ర కుమార్, డిఎల్‌డిఓ సుజాత, మార్కాపురం, గిద్దలూరు మున్సిపల్ కమిషనర్లు నారాయణరావు, రమణబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొండయ్య అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నారు

తెలుగు యువత అధ్యక్షులు దొగిపర్తి బాలకృష్ణ



(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 3)

ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ అభివృద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నారని చీరాల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు, యువ నాయకుడు దొగిపర్తి బాలకృష్ణ అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. చీరాల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధితో పాటు చీరాల తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు, బీచ్‌ను మరింత సుందరీకరించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలుస్తూ, సమస్యలను పరిష్కరించేందుకు ముందుండే నాయకుడు మాలకొండయ్య అని బాలకృష్ణ అన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే కుమారులు మద్దులూరి మహేంద్రనాథ్, అమర్నాథ్‌లు పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాలకొండయ్యపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని అసత్య ఆరోపణలతో దెబ్బతీయడం ఎవరి వల్లా కాదని బాలకృష్ణ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య నాయకత్వంలో కూటమి బలంగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారి ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శన

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 3)

మహాత్మా గాంధీ అనుసరించిన అనేక మార్గాలను విశ్వసించి, పల్నాటి గాంధీగా పేరుగాంచిన మాజీ పార్లమెంటు సభ్యులు, రొటేరియన్ కీర్తిశేషులు కోటా సైదయ్య స్మారక గాంధీ జయంతి వేడుకలు స్థానిక కెసిపి వెలగపూడి లక్ష్మణ్ దత్ ఆడిటోరియం నందు గత రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులకు జాతీయత భావాలు, దేశభక్తిని పెంపొందించేందుకు వివిధ రూపాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. భారతదేశ స్వతంత్ర కోసం పోరాడిన వీరుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ఫాన్సీ డ్రెస్సులు మరియు నృత్యాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ముందుగా మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి,కోటా సైదయ్య చిత్రపటాలకు పూలమాలలను సమర్పించి, రోటరీ అన్స్ మహిళలచే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి మార్గాలలో నడిచిన గాంధీజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, విద్యార్థులలో ఆ మార్గాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోట హనుమంతరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్స్ ఇక్కుర్తి శంకర్, తిర్లిక శ్రీనివాసరావు, రోటరీ ట్రస్ట్ ట్రెజరర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, కార్యదర్శి డాక్టర్ మూడవ దశరథ్ చౌహన్, ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు, సీనియర్ రోటరీ క్లబ్ సభ్యులు, రోటరీ మాజీ అధ్యక్ష,కార్యదర్శులు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, వారి యొక్క తల్లిదండ్రులతో కోలాహలంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు గాను గ్రూప్ డాన్స్ విభాగంలో సెంట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు మొదటి బహుమతిని, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ద్వితీయ బహుమతిని, కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు తృతీయ బహుమతిని, సోలో విభాగంలో కిడ్స్ పాఠశాల విద్యార్థి మొదటి బహుమతిని, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి రెండో బహుమతిని, విజ్ఞాన్ హై స్కూల్ విద్యార్థులు మూడో బహుమతిని సెంటాన్స్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు పొందడం జరిగింది. గాంధీజీ గురించి తెలుసుకో అనే నినాదంతో జరిగిన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, డిబేటు,క్విజ్ నందు గెలుపొందిన వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులందరికీ మెమెంటోలు, ప్రశంశాపత్రాలను అందజేసినారు. గాంధీజీ ఆలోచన, ఆచరణీయ అంశాలలో అతి ప్రధానమైనటువంటి స్వచ్ఛత కార్యక్రమంలో యువత భాగస్తులు కావాలని, ఆరోగ్యకరమైన ఆనందకరమైన జీవితాన్ని గడపడానికి ఇది ముఖ్య విధానమని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు తెలిపారు.





ఏఈఆర్ ప్రణాళిక పై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 3)



అమరావతి ఎకనామిక్ రీజియన్ ప్రణాళికలో భాగంగా మార్కాపురం జిల్లాకు సంబంధించి సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. శనివారం మార్కాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎఈఆర్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొని వివిధ శాఖల అధికారులతో జిల్లాలోని అభివృద్ధి అవకాశాలు, భవిష్యత్ అవసరాల పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందుబాటులో ఉన్న సహజ వనరులు, భౌగోళిక పరిస్థితులు, వ్యవసాయ, ఉద్యానవన, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో ఉన్న అవకాశాలను సమగ్రంగా గుర్తించాలని సూచించారు. ఎఈఆర్ ప్రణాళిక ద్వారా జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించేలా, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. ప్రతి శాఖ తమ పరిధిలో జిల్లాకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, పర్యాటక రంగం, తాగునీరు, పట్టణ–గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను సేకరించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతను గుర్తించి, దానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికలో పొందుపరచాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి వాస్తవ పరిస్థితులు, ప్రజల అవసరాలు, భవిష్యత్‌లో ఏర్పడే అవకాశాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం ప్రస్తుత అవసరాలకే పరిమితం కాకుండా రాబోయే సంవత్సరాల్లో జిల్లాకు ప్రయోజనం కలిగే విధంగా దీర్ఘకాలిక దృష్టితో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌లో చేర్చడం వరమిని దానికి అనుగుణంగా మనం ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్ బాబు, ఉద్యానశాఖ అధికారి రమేష్, సిఆర్డిఏ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే పరమావధి
పేదవాడికి మెరుగైన వైద్యమే మన లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, అక్టోబర్ 3)

ఎర్రగొండపాలెం, పెద్ద దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ దిశానిర్దేశం చేశారు. పెద్ద దోర్నాల, ఎర్రగొండపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ చైర్మన్‌గా యర్రగొండపాలెం తాటిపర్తి చంద్రశేఖర్, కమిటీ సభ్యులు లాలు నాయక్‌తో కలిసి ఆసుపత్రి బాడీ మీటింగ్‌ను నిర్వహించారు.




ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలలో మౌలిక వసతులను వేగవంతంగా మెరుగుపరచాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యుత్తమ స్థాయి వైద్య సేవలు, అవసరమైన మందులు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఆరోగ్యం, ఆసుపత్రి సమగ్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కమిటీ సభ్యులు పూర్తి బాధ్యతతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





5న యాదవుల మహా ధర్నా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)

ఈనెల 5వ తేదీ సోమవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం దగ్గర యాదవుల మహా ధర్నా జరుగుతుందని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో యాదవులు అనేక సమస్యల పై ఇబ్బందులు పడుతున్నారని, దానికి నిరసనగా భారీ ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దాసరి మాల్యాద్రి వారి కుమారుల పై అక్రమంగా పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును తీసివేయాలని, లింగసముద్రం మండలం అన్నిబోయినపల్లి గ్రామంలో గంగమ్మ జాతరను జరగకుండా అడ్డుకుంటున్న చర్యలను ఖండిస్తూ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నా ను జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.


డిఎస్పీ నిమ్మగడ్డను కలిసిన శాసనాల



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 3)

మార్కాపురం నూతన డిఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నిమ్మగడ్డ సత్యనారాయణను శనివారం ఉదయం తన కార్యాలయంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డివిజన్‌లో శాంతిభద్రతలను కాపాడే విషయంలో తెలుగుదేశం పార్టీ సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. డిఎస్పీ నిమ్మగడ్డ సత్యవరాయణ మార్కాపురం ప్రాంత ప్రజలకు బాగా సుపరిచితులు అని శాసనాల అన్నారు.

వృద్ధులకు బట్టలు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)

ఒంగోలులోని ఉమామహేశ్వర జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ చిలుకూరి జయలక్ష్మి 71వ జన్మదినం సందర్భంగా సమతా మహిళా వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ చేశారు. శివప్రసాద్ కాలనీలో ఉన్న సమత మహిళా వృద్ధాశ్రమంలో 30 మందికి చీరలు, పండ్లు తో పాటు ఆశ్రమానికి కావాల్సిన ఫ్యాన్లు అందజేశారు. కాలేజీ కరస్పాండెంట్ జయలక్ష్మి పుట్టిన రోజు వేడుకలు ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి కాలేజీ సిబ్బంది చేశారు. మహిళా వృద్ధాశ్రమానికి తమ కాలేజీ తరపున అండగా ఉంటామని డైరెక్టర్ చిలుకూరి మల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోపర్తి లక్ష్మీనారాయణ, ఆశ్రమ నిర్వాహకులు అంకబాబు, మాలతి పాల్గొన్నారు.

పత్తి రైతులకు కపాస్ కాంతి పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 3)

మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ (కపాస్ కాంతి) 2026-27 కార్యక్రమంలో భాగంగా కొణిదెనలో పత్తి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు ఏప్రాయం ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఏపీ "ఎయిమ్స్" ద్వారా ఎరువులు పొందే విధానం, పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలకు కలిగే నష్టాన్ని నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పీఎం కిసాన్ ఈ కేవైసీ పూర్తి చేయని రైతులు మీ సేవా లేదా రైతు సేవా కేంద్రాల్లో ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పంటల బీమా వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ మౌలాలి, వీఏఏ నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, అక్టోబర్ 3)

గ్రామాలలో గ్రూప్ రాజకీయాలను ప్రోత్సహించకుండా అందరినీ ఒకే తాటిపైకి తెచ్చి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే నాయకుడిని ఎన్నికల్లో ఎన్నుకోవాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. శనివారం పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో రూ.26.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎరిక్షన్ బాబు తెలిపారు. మండలంలో తోకపల్లి గ్రామపంచాయతీలోని సోమేపల్లి గ్రామంలో రూ.40 లక్షల సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. స్థానికవరం గ్రామంలో స్వర్ణ గ్రామ కార్యాలయం రోడ్డుకు 15 లక్షల రూపాయల సిసి రోడ్డు కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గొట్టం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి జడ్డ రవి, టిడిపి నాయకులు మిల్లు కొండారెడ్డి, నీటి సంఘం సర్పంచ్ చిన్న కొండారెడ్డి, మండల నాయకులు పాలంకయ్య, శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం





(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 3)

మండలంలోని మోట్రావులపాడు అంగన్వాడి కేంద్రం నందు 9వ జాతీయ పోషణ మాసం మన అంగన్వాడి-మన బాధ్యతలో భాగంగా "అంగన్వాడీ ఉత్సవం" కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత కేంద్రంలో పోషక పదార్థాలతో "లోగో" ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను పోషణ, సంరక్షణ, చిన్నారుల ప్రాథమిక విద్యాభివృద్ధికి సంబంధించిన సమాజ ఆధారిత కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా చేయడం, పోషణ పై సమిష్టి బాధ్యత, జవాబు దారీతనం పెంపొందించడం ముఖ్య లక్ష్యమన్నారు. ఎస్ఎన్పి మెనూ బోర్డులను ప్రదర్శన, ఈసీసీఈ విద్యా బోధన గృహ సందర్శన, మొదటి 1000 రోజుల ప్రాముఖ్యత, అభివృద్ధి ఆలస్యం అనుమానిత పిల్లల గుర్తింపు రెఫరల్ గురించి, పీఎంఎం వై పథకం నమోదు, లబ్ధిదారులు గురించి, ఏఐ స్క్రీనింగ్, స్టిములేషన్, ఏఎంసి కమిటీల బాధ్యతలు గురించి అవగాహన కలిగించారు. తదుపరి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించి అనంతరం పోషకాహార ప్రాముఖ్యత పై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కె సుబ్బలక్ష్మి, పి బసవమ్మ, హెల్పర్ ఎ రత్తమ్మ, గ్రామాల్లో గర్భవతులు, బాలింతలు, కిషోర్ బాలికలు, పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, అక్టోబర్ 3)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 5న ప్రొద్దుటూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పర్యటన ఏర్పాట్లను ముమ్మరం చేసింది. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డాక్టర్ నిధిమీనాతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రొద్దుటూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో జల్ జీవన్ మిషన్కు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, హెలీప్యాడ్, భద్రతా ఏర్పాట్లు, ప్రజల సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ముందుగా అమృత్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ను కలెక్టర్ పరిశీలించారు. హెలీప్యాడ్ వద్ద భద్రత, రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాల పై ఆర్అండ్బి, పీఆర్ ఇంజినీర్లకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనే నాయకుల లైన్అప్ కోసం అవసరమైన భారీ కేడ్ల ఏర్పాటుపై కూడా అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కొర్రపాడు రోడ్డు సర్కిల్లో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల పైలాన్ నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్, పనుల నాణ్యత, నిర్మాణ పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి ప్రొద్దుటూరు బైపాస్-జమ్మలమడుగు మార్గంలో ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి ప్రజావేదిక సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలు, భద్రతా చర్యలు, వేదిక, పార్కింగ్, నిర్వహణ తదితర అంశాల పై నాయకులు, సంబంధిత అధికారులతో చర్చించారు. అలాగే ముఖ్యమంత్రి నిర్వహించనున్న పార్టీ కేడర్ సమావేశం కోసం చేపడుతున్న ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. భద్రతా చర్యల పై సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, ఏఎస్పీ విభూకృష్ణ, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, భూపేష్‌రెడ్డి, తదితరుల అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, తహసీల్దార్ ఉదయ్ భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్అండ్బీ, ఏపీఎస్పీడీసీఎల్, పీఆర్, పోలీస్ శాఖల అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.







కరువు కోరల్లో గ్రామీణ పేదలు

పనుల్లేక.. పంటల్లేక.. పూట గడవని బతుకులు

ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలి

ప్రతి పేద కుటుంబానికి రూ.10 వేల కరువు భత్యం ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘాల డిమాండ్


గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)

ఒకవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు వ్యవసాయ పనుల్లేక కూలీలకు ఉపాధి కరువు . నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుల బతుకులు భారంగా మారాయి. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో గ్రామీణ పేదలకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పథకానికి రూ.2 లక్షల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించి, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని బాపూజీ కాంప్లెక్స్ వద్ద గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, పేదల ఉపాధిని దెబ్బతీస్తున్న వీబి గ్రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, పంటలు లేక వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కరువు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని తక్షణమే రూ.2 లక్షల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించి, కూలీలకు పనులు కల్పించాలని కోరారు. బికెఎంయూ జిల్లా నాయకులు దాసరి అంజయ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సరైన వ్యవసాయ పనులు లేకుండానే గడిచిపోయిందని తెలిపారు. ఇప్పటికీ తగిన వర్షాలు కురవకపోవడంతో రబీ సీజన్లోనూ పంటలు సాగు చేయలేని పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు పండకపోతే వ్యవసాయంపై ఆధారపడిన కూలీల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కరువు పనులు లేకపోవడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం పేదల జీవనాన్ని మరింత దుర్భరం చేసిందన్నారు. ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి రూ.10 వేల కరువు భత్యం అందించాలని, మూడు నెలల పాటు నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కేజీ మస్తాన్, కంకణాల వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు, ఉబ్బా వెంకటేశ్వర్లు, ఈదర సుబ్బారావు, గద్దల రవి, సీహెచ్ ఆదినారాయణ, ప్రభాకర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డును పొందిన డిపిఓను అభినందించిన సర్పంచుల సంఘం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)

గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ ప్రకాశం జిల్లాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా స్వచ్ఛ అవార్డును పొందిన జిల్లా పంచాయతీ అధికారి అనుపమ సతీష్‌కు పంచాయతీ సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపన అధ్యక్షులు జి వీరభద్రాచారి అభినందనలు తెలిపారు. శనివారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో డిపిఓను అభినందించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవార్డు ద్వారా జిల్లాలో స్వచ్ఛమైన, పరిశుభ్రమైన గ్రామాలుగా మార్చేందుకు బాధ్యత పెరిగిందన్నారు. వీర భద్రాచారి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛ అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. గ్రామాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలను పెంచాలని కోరారు. గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల వేతనాలను పెంచాలని వీరభద్రా చారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు గుంటూరు మస్తాన్‌రావు, జి మురహరిరావులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్‌రెడ్డి పల్లె పండుగతో దసరా ముందే వచ్చింది ఎమ్మెల్యే జూలకంటి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 3)



మాజీ సీఎం జగన్ బీసీల ద్రోహి అని 34 శాతం రిజర్వేషన్ కల్పించి వారిని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా బలోపేతం చేసేందుకు టిడిపి కట్టుబడి ఉంటే వైసిపి నేతలు కోర్టుల కెళ్ళి అడ్డుకున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రెంటచింతల దళితవాడిలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బీసీల రిజర్వేషన్ కు సంబంధించి బిల్లు పాస్ చేయించి గెజిట్ కూడా తెచ్చారని పేర్కొంటూ బీసీల రాజకీయ ఎదుగుదలను వైసీపీ నేతలు చూడలేకపోతున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు 34% రిజర్వేషన్ ఇవ్వకపోవడం వలన వార్డ్ మెంబర్ల దగ్గర నుండి జడ్పీ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్‌ల వరకు 16,800 మంది పదవులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె పండుగ గ్రామాల్లో అప్పుడే దసరా పండుగ కనబడుతుందని సంవత్సరాల తరబడి అభివృద్ధికి నోచుకోని కాలనీలలో టిడిపి ప్రభుత్వం సిసి రోడ్డు వేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, టిడిపి మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శౌర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి, రాయపరెడ్డి, తుమ్మ జ్యోతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు శివయ్య రాజ్ కుమార్, సైదులు యాదవ్, నాలం పెద్దబాబు, ఆకుల నరసింహారావు, మండలపు హనిమరెడ్డి, గాలయ్య, జ్ఞానయ్య, దానయ్య, సామేలు, సెల్వరాజ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిశెల నిర్మించి సాగునీరిస్తాం

పత్తి రైతు కూలీలతో జూలకంటి ముఖాముఖి





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 3)

వరికపూడిశెల ప్రాజెక్టు పనులు ప్రారంభించి, వచ్చే ఏడాది నాటి రైతులందరికీ సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఆయన, గంగలకుంట గ్రామ శివారు పత్తి పొలంలో పనులు చేస్తున్న కూలీలతో ముఖాముఖి నిర్వహించారు. వారితో పాటు పత్తిని తీస్తూ రైతుల సాధకబాధలను అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ, రైతు సంక్షేమ పథకాలతో రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం అక్కడే ఉన్న వీరస్వామి చెరువును పరిశీలించి, సాగునీటి నిల్వకు అవసరమైన పరిస్థితిని పర్యవేక్షించారు.

పట్టణంలో సిసి రోడ్ల పండుగ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 3)

పట్టణంలో సిసి రోడ్ల పండుగ శనివారం అట్టహాసంగా జరిగింది. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పొదిలి పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్లు అన్ని హెచ్ఏంఏ పథకం ద్వారా పొదిలి పట్టడానికి మంజూరైన రూ.20 కోట్ల రూపాయలను పొదిలి పట్టణంలోని వివిధ వార్డుల్లో వినియోగించి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఒకటో వార్డులో, రెండో వార్డ్ లోని ఆంజనేయస్వామి గుడి వద్ద, మూడవ వార్డులోని తాలూకా ఆఫీస్ రోడ్డు, మూడవ వార్డులోని తూర్పు పాలెం, 4వ వార్డులోని మసీద్ తోట ప్రాంతం, ఐదవ వార్డ్ లోని నవాబ్ మిట్ట ప్రాంతం, ఆరు వార్డులో ఎన్జీవో కాలనీ, ఆరవ వార్డులోని ఎన్జీవో కాలనీ, ఎస్టీ కాలనీ, ఏడవ వార్డులోని విరాట్ నగర్, 9వ వార్డులోని ఆర్డబ్ల్యూస్ ఆఫీస్ వద్ద, కంభాలపాడు పంచాయతీలోని బాలాజీ నగర్‌లో వివిధ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్ఏంఏ నిధుల ద్వారా పొదిలి పట్టడానికి రూ.20 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని దీని ద్వారా వచ్చే నెల, రెండు నెలల లోపు పొదిలి పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో సిసి రోడ్లను నిర్మిస్తామని అన్నారు. గత 30 సంవత్సరాలుగా సరైన అంతర్గత రోడ్లు లేక పొదిలి పట్టణంలో ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమన్నారు. వార్డుల్లో సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తుంటే ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని, గత 30 సంవత్సరాలుగా లేని రోడ్లు ఇప్పుడు పూర్తి కాబోతుంటే ప్రజలు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. త్వరలోనే అమృత్ 2 పథకం ద్వారా మంజూరైన రూ.165 కోట్లతో రామతీర్థం రిజర్వాయర్ నుంచి ఇంటింటికి పైపులైన్‌కు టెండర్లు పిలిచి వచ్చే ఆరు నెలల లోపు పొదిలి పట్టణంలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందిస్తామని అన్నారు.

ఎండను సైతం లెక్కచేయక ఈ సీసీ రోడ్ల ప్రారంభోత్సవాల్లో పొదిలి నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, మెడికల్ బోర్డు మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణబాబు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్ (పండు), మర్రిపూడి మాజీ ఎంపిపి వాకా వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి వెంకట నారాయణ ప్రతాప్, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లికార్జున, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ కాలేషా, 4వ వార్డు కన్వీనర్ షేక్ అల్లాబకాష్, ముని శ్రీనివాసులు, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, తెలుగు యువత ఖాదర్, జమీర్, జిందు, రసూల్, గొంట్ల రవికుమార్, షరాబు దీపు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డు ప్రజలు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.







మండల జన విజ్ఞాన వేదిక కన్వీనర్ పెరుమాళ్ళ కోటి మోహన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతుల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 3)

మండలంలోని చెన్నారెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు, జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్, కార్యదర్శిగా పనిచేస్తున్న పెరుమాళ్ళ కోటిమోహన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు స్వాతంత్రోద్యమంలో గాంధీజీ పాత్ర అనే అంశం పై వ్యాసరచన పోటీని నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో ప్రధమస్థానంలో సిందూలత, ద్వితీయ స్థానంలో కార్తీక, తృతీయ స్థానంలో జయశ్రీలు విజేతలుగా నిలిచారు. కన్సోలేషన్ విజేతగా ఆరికట్ల కవిత కాగా వీరందరికీ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెరుమాళ్ళ కోటి మోహన్ సొంత ఖర్చులతో విజేతలకు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ విధంగా పాఠశాలల్లోని విద్యార్థిని, విద్యార్థులకు విజ్ఞానపరంగా క్విజ్, వ్యాసరచన పోటీలను స్వతహాగా నిర్వహిస్తూ విద్యార్థులలో పోటీ తత్వాన్ని అలవరిస్తూ, కాంపిటీటివ్, రీక్షలకు ప్రోత్సహిస్తూన్న పెరుమాళ్ళ కోటి మోహన్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందమైన ఎం చంద్రశేఖరరెడ్డి, కిషోర్, రమేష్, జ్యోతిలు మనస్ఫూర్తిగా ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలకోటయ్య సంఘం అంగన్వాడి కేంద్రంలో పోషణ మహా కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 3)

మండలంలోని కరేడు సెక్టార్‌లో గల బాలకోటయ్య సంఘం అంగన్వాడి కేంద్రంలో సిడిపిఓ డి మాధవిలత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సూపర్వైజర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మొత్తం 5 థీమ్స్‌గా ఉన్నవన్నారు. ప్రతివారం ఒక్కొక్క థీమ్ పైన కార్యక్రమం జరపాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో తాజాగా వేడిగా భోజనం అనే అంశం పైన, అంగన్వాడీ కేంద్రంలో వారాంతర భోజన క్యాలెండర్, పోషణ విలువలు కలిగిన మునగాకుతో వంటలు, 3 నుండి 6 సంవత్సరాల పిల్లలను కచ్చితంగా అంగన్వాడి కేంద్రాల్లో ఇచ్చే పోషక ఆహార విలువల గురించి ప్రతి ఒక్క తల్లి అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ అందుబాటులో ఉండి వారి అభివృద్ధి ఎంతో దోహదపడుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అంజలి, సుశీల, మార్తమ్మ, పిల్లలు, తల్లులు, గర్భవతులు, బాలింతలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

అభివృద్ధిలో మార్కాపురం ప్రాంతాన్ని

అగ్రభాగాన నిలబెడతాం

మార్కాపురం ఎమ్మెల్యే కందుల

నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 3)

అభివృద్ధిలో మార్కాపురం ప్రాంతాన్ని అగ్రభాగాన నిలబెడతాం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం మార్కాపురం పట్టణంలోని శివారు ప్రాంతాలైన ఎస్టేట్, డ్రైవర్స్ కాలనీలలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మార్కాపురం మున్సిపాలిటీకి హెచ్ఏంఏ నిధుల ద్వారా మంజూరైన రూ.35 కోట్లలో భాగంగా పట్టణంలోని శివారు ప్రాంతాలైన ఎస్టేట్, డ్రైవర్స్ కాలనీ, తదితర ఏరియాలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణాన్ని సుందరీకరణలో భాగంగా సీసీ రోడ్లు మొదటగా పూర్తి చేసి అనంతరం సీసీ డ్రైన్లు కూడా ఏర్పాటు చేసి మార్కాపురం పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే మార్కాపురం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించారని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ తీర్చిదిద్దుతున్నామని, మార్కాపురం పట్టణంలో త్వరలో ఇంటింటికి పైపులైన్ పూర్తి చేసి ప్రతి ఇంటికి త్రాగునీరు అందిస్తామన్నారు. గతంలో వైసిపి పాలకులు ఈ ప్రాంతాన్ని భూ కబ్జాలకు నిలయంగా, అరాచకలకు కేరాఫ్ అడ్రస్ గా మార్చారని మంచి సుపారి పాలన అందించే మన ప్రభుత్వానికి మద్దతు పలకాలని తద్వారా భవిష్యత్తులో మార్కాపురం ప్రాంతాన్ని అభివృద్ధి పదంలో అగ్రభాగాన నిలుపుతానని అన్నారు.


కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఆహ్వాన పత్రిక అందజేసిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, అక్టోబర్ 3)

దసరా పర్వదినాలను పురస్కరించుకుని ప్రొద్దుటూరులో ఘనంగా నిర్వహించనున్న శ్రీమతి కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యేను కలిసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బుశెట్టి రామమోహన్ రావు, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రవి సెక్రటరీ మురికి నాగేశ్వరావు తదితరులు శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. దసరా సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించాలని వారు కోరారు. ప్రొద్దుటూరు పట్టణంలో ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, దసరా నవరాత్రి ఉత్సవాలను భక్తుల భాగస్వామ్యంతో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆధ్యాత్మికత, ఐక్యత, సేవాభావం మరింత పెంపొందేలా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బుశెట్టి రామమోహన్ రావు, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రవి సెక్రటరీ మురికి నాగేశ్వరావు తో పాటు సంఘ ప్రతినిధులు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.





అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కుపాదం
ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)

పేకాట ఆడుతున్న స్థావరంపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాల పై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ మంగమూరు గ్రామ శివారు పొలాల్లో శనివారం మధ్యాహ్నం సమయంలో పేకాట స్థావరం పై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.4550 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారి పై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ 9121102113,పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

షణ్ముఖ వెలుగు

ePaper
www.shanmukhavelugu.com

మార్కాపురం డీఎస్పీగా నిమ్మగడ్డ సత్యనారాయణ శనివారం ఉదయం బాధ్యతల స్వీకరణ

పుట్టపర్తి నుంచి బదిలీ పై రాక
శాంతిభద్రతల మెరుగుదలకు కృషి చేస్తా
పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి
స్వాగతం పలికిన సబ్‌డివిజన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, వెలుగు, అక్టోబర్ 3)

మార్కాపురం నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నిమ్మగడ్డ సత్యనారాయణ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తి డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై మార్కాపురానికి వచ్చారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం మార్కాపురం సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతలను మెరుగుపరిచేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

గతంలో ఇదే డివిజన్‌లో విధులు

నిమ్మగడ్డ సత్యనారాయణకు మార్కాపురం డివిజన్‌తో గతంలోనూ అనుబంధం ఉంది. ఆయన పెద్దారవీడుతోపాటు డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. అప్పట్లో ఈ ప్రాంతంలో పనిచేసిన ఆయన ఇప్పుడు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. స్థానికంగా పలు స్టేషన్లలో పనిచేసిన అనుభవంతో మార్కాపురం డివిజన్‌లోని పరిస్థితుల పై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. గతంలో ఎస్ఐగా సేవలందించిన ప్రాంతానికే ఉన్నత హోదాలో తిరిగి రావడం ఆయన ఉద్యోగ ప్రస్థానంలో మరో సంఘటన....

శాంతిభద్రతల మెరుగుదలకు ప్రాధాన్యం

బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిమ్మగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని చెప్పారు. తన పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా జీవించే వాతావరణాన్ని కొనసాగించడంలో పోలీసు శాఖతోపాటు ప్రజల సహకారం కూడా అవసరమనే విషయాన్ని ఆయన తన విజ్ఞప్తి ద్వారా ప్రస్తావించారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.



ప్రజల సహకారంతోనే సమర్థ నిర్వహణ

మార్కాపురం సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల నిర్వహణకు ప్రజల భాగస్వామ్యాన్ని నూతన డీఎస్పీ కోరారు. పోలీసు శాఖ చేపట్టే శాంతిభద్రతల పరిరక్షణ చర్యలకు ప్రజలు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే శాంతిభద్రతల మెరుగుదల, ప్రజల సహకారం అనే అంశాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

నూతన డీఎస్పీకి అధికారుల స్వాగతం

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మగడ్డ సత్యనారాయణకు మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు. కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు అధికారుల పలకరింపులు, సిబ్బంది స్వాగతం మధ్య బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. శాంతిభద్రతల మెరుగుదలకు కృషి చేస్తానని, ఇందుకు ప్రజలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని నూతన డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ కోరారు.

గుండెపోటుతో మాజీ ఎంపిపి మాకినేని నారాయణరావు మృతి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 3)

పొదిలి మండలపరిషత్ మాజీ మండలాధ్యక్షుడు, టీడీపి సీనియర్ నాయకులు మాకినేని నారాయణరావు శనివారం సాయంత్రం మృతి చెందాడు. గత కొంతకాలంగా ఆయన గుండె సంభందమైన వ్యాధితో భాధపుడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. జిల్లా బోర్డ్ మాజీ మెంబర్ మాకినేని నరసయ్య మనవడిగా, దివంగత మాజీ మంత్రి నారాయణస్వామికి మేనల్లుడిగా పొదిలి ప్రాంతంలో మంచి గుర్తింపు పొందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. అంత్యక్రియలు గుంటూరులో ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల పలువురు టీడీపి నాయకులు కాటూరి వెంకట నారాయణ బాబు, కాటూరి నారాయణ ప్రతాప్, మాకినేని రమణయ్య, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఈనాడు కోటేశ్వరరావు, కాటూరి నారాయణరావు, స్వర్ణగీత, కాటూరి శ్రీనివాసులు, రావిపాటి అశోక్, పోపూరి నరేష్ బాబు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 3)

గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబును జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత కలెక్టరేట్ లోని ఆమె చాంబర్లో శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ప్రకటించిన రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ మున్సిపాలిటీ -2026 అవార్డుకు గిద్దలూరు మున్సిపాలిటీ ఎంపికైంది. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, డోర్ టు డోర్ వేస్ట్ కలెక్షన్, వేస్ట్ టు కంపోస్ట్ ప్లాంట్, లెగసీ వేస్ట్ మేనేజ్మెంట్, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించడం తదితర అంశాల్లో కమిషనర్ చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గిద్దలూరు మున్సిపాలిటీకి కు ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



హాస్టల్ విద్యార్థిని లైంగిక దాడి ఘటనలో తార్పుడు కామాంధులను అరెస్ట్ చెయ్యాలి

హాస్టల్ వార్డెన్ తేరోజమ్మను కూడా అరెస్టు చేయాలి
బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నిర్మల జ్యోతిని సస్పెండ్ చేయాలి
రిమ్స్ వద్ద దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు నీలం నాగేంద్ర, పివి రావు, మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య డిమాండ్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)

జరుగుమల్లి ప్రభుత్వ హాస్టల్ దళిత విద్యారి ని పై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడు బొట్టు వెంకట్రావు తార్పుడు గత్తి శారద ను వెంటనే అరెస్ట్ చెయ్యాలని మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ లోని సఖి సెంటర్ వద్ద డిమాండ్ చేసారు. శనివారం ఒంగోలు సఖి సెంటర్ లో లైంగిక దాడికి గురైన విద్యార్థిని బంధువులను దళిత నాయకులు నీలం నాగేంద్ర రావు పరామర్శించారు. బాధిత కుటుంబం నుంచి లైంగిక దాడి జరిగినప్పటినుండి పోలీస్ బీసీ వెల్ఫేర్ అధికారుల విచారణ ను అడిగి తెలుసుకున్నారు.తదనంతరం సఖి సెంటర్ వద్ద మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య మాట్లాడుతు జరుగుమల్లి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లో పదోవ తరగతి చదువుతున్న దళిత విద్యార్థులను ఇద్దరని ఒంగోలోని కామాంధుడు బొట్టు వెంకట్రావు ఇంటికి పంపించిన కార్పోడ్ తార్పుడుగత్త శారద మరియు కామాంధుడు వెంకట్రావు లను పోక్సో ఎస్సీ ఎస్టీ యాక్ట్ బాలికల అక్రమ రవాణా హత్యాచార నేరం పై అరెస్ట్ చేయ్యాలని జిల్లా ఎస్పీ ని డిమాండ్ చేసారు. మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన దళిత బాలిక విద్యార్థిని తండ్రి జగదీష్ గత నెల 13 వ తేదీన మరణించడాన్నారు. కామాంధుడైన బొట్టు వెంకట్రావు బావ బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ కావడం తో అదే శాఖ లో కుక్ గా పని చేసే శారద తో అతనికి పరిచయం ఉందన్నారు. ఆ పరిచయం కాస్త వెలుగు డిఆర్డిఏ వెలుగు రిటైర్డ్ ఉద్యోగి బొట్టు వెంకట్రావుతో సాన్నిహిత్య సంబంధం ఏర్పడిందన్నారు. బాలిక తండ్రి దినానికి వెళ్లిన బొట్టు వెంకట్రావు బాలికపై కన్నేసి శారదా ద్వారా ట్రాప్ చేయించి తన ఇంటికి లైంగిక దాడికి గురైన బాలికతో పాటు మరో బాలికను కూడా పిలిపించుకున్నారన్నారు. ఇద్దరు విద్యార్థులకు పోర్న్ బూతు వీడియోలు చూపించగా ఒక బాలిక భయపడి బయటికి వెళ్లిందన్నారు. రెండో బాలికపై 62 ఏళ్ల వయసున్న కామాంధుడు పొట్టు వెంకటరావు అత్యాచారానికి పాల్పడ్డాడు అన్నారు. ఈ దళిత బాలిక లైంగిక దాడి ఘటనపై ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద అదే రోజు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఆందోళన చేసి కేసు కట్టించామన్నారు. దళిత బాలిక లైంగిక దాడి ఘటన 96/26 ఎస్సీ, ఎస్టీ, ఫోక్సో బాలికల అక్రమ రవాణా హత్యాచార నేరంగా ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందన్నారు. తాము మరల పోలీస్ అధికారులు కేసును పక్కదారి పట్టించే అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి జిల్లా అధికారులతో త్రీ మెన్ కమిటీ విచారణ ఆదేశాలు ఇప్పిచ్చామన్నారు. మరలా శనివారం ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ లో సఖి సెంటర్లో చికిత్స పొందుతున్న దళిత బాలిక కుటుంబ సభ్యులను బంధువులను దళిత నేత నేత నాగేంద్రరావుతో కలిసి పరామర్శించమన్నారు. ప్రభుత్వ హాస్టల్లో బాలికలు లైంగిక దాడికి గురైన ఘటనలో హాస్టల్ వార్డెన్ తెరోజమ్మను కూడా అరెస్టు చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నిర్మల జ్యోతిని కూడా సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ రాజా బాబును మాల మహానాడు నాయకులు దారా అంజయ్య మేడికొండ మురళి పట్రా బంగారం తదితరులు కోరారు.

జీజీహెచ్‌లో వైద్యుల సమయపాలనపై ప్రత్యేక సమీక్ష

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి
రోగులకు నిరంతర వైద్య సేవలు అందేలా విభాగాధిపతులు పర్యవేక్షించాలి
అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)


ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే ప్రతి ఒక్క రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్యులు, సిబ్బంది సమయపాలనను కచ్చితంగా పాటించాలని జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ స్పష్టం చేశారు. ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య సేవలను విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలకు సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు. జీజీహెచ్ ఆసుపత్రిలో వైద్యుల సేవల అందుబాటు, సమయపాలన, ఓపీ విభాగాల్లో వైద్యుల హాజరు తదితర అంశాలపై అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవిలతతో కలిసి అడ్మినిస్ట్రేటర్ ప్రతి ఓపీ విభాగాన్ని సందర్శించారు. ఆయా విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారా, రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయి, ఓపీ కార్యకలాపాలు సక్రమంగా జరుగుతున్నాయా అనే అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు విధుల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వందలాది మంది రోగులు ప్రతిరోజూ జీజీహెచ్‌కు వైద్య సేవల కోసం వస్తున్నారని, వారందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత విభాగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విభాగాధిపతి తమ పరిధిలోని వైద్యులు, సిబ్బంది సమయపాలనను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఓపీ సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండటం వల్ల రోగులకు వేచి ఉండే సమయం తగ్గడంతో పాటు వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా వైద్యులు సెలవు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటే ముందస్తుగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని అడ్మినిస్ట్రేటర్ స్పష్టం చేశారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం లేదా విధుల సమయపాలనలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉచిత ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉండటం, ఆరోగ్య రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యల నేపథ్యంలో జీజీహెచ్‌కు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులు ప్రధాన ఆధారంగా ఉన్నందున, వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించడం వైద్యులు, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, సమయపాలన పాటించడం ప్రభుత్వ వైద్య సేవల్లో అత్యంత కీలకమైన అంశాలని ఆయన తెలిపారు. రోగులు ఆసుపత్రికి వచ్చినప్పుడు సంబంధిత విభాగంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల వారికి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం జీజీహెచ్‌లోని అన్ని విభాగాధిపతులతో అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ సమావేశం నిర్వహించి వైద్య సేవలు, ఓపీ నిర్వహణ, వైద్యుల హాజరు, సమయపాలన తదితర అంశాలపై సమీక్షించారు. రోగులకు నిరంతరాయంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యుల సమయపాలన విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, విధుల పట్ల నిర్లక్ష్యం లేదా నిర్దేశిత సమయాల్లో అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని అడ్మినిస్ట్రేటర్ వెంకటరమణ స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా, సమయానుకూలంగా వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ఒంగోలు నియోజకవర్గంలో 193 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ

మంజూరైన ఇళ్ల నిర్మాణ అనుమతి పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)

ఒంగోలు నియోజకవర్గ పరిధిలో అర్హులైన పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ పథకానికి ప్రాధాన్యతనిస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తెలిపారు. శనివారం ఒంగోలు నగరంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని మొత్తం 193 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణ అనుమతి పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులను ఉద్దేశించి దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ ఒంగోలు నగర పరిధిలో 153 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ. 2.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తపట్నం మండల పరిధిలో 40 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ. 2.89 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 523 గృహాల నిర్మాణానికి సంబంధించి రూ. 14.62 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇంటి స్థలం ఉండి, సొంతంగా ఇల్లు నిర్మించుకోవాలనే ఆసక్తి ఉన్న అర్హులైన వారు గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకొని, సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గృహ నిర్మాణ కార్యక్రమాల అమలులో లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ ప్రసాద్, డీఈ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, నగర టీడీపీ అధ్యక్షుడు బండారు మదన్, ఏఈలు నాంచారెడ్డి, మనోజ్, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.









పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి– డాక్టర్ రాంబాబు

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, అక్టోబర్ 3)

మండలంలోని రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న పశువుల బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రాంబాబు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం రూ. 298 చెల్లించి తమ పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవచ్చన్నారు. అనుకోని పరిస్థితుల్లో పశువు మృతి చెందినట్లయితే ప్రభుత్వం రూ. 30 వేల వరకు పరిహారం అందిస్తుందని తెలిపారు. రేషన్ కార్డు కలిగి ఉండటంతో పాటు పశువులకు చెవికమ్మ వేసి ఉన్న రైతులు ఈ బీమా పథకానికి అర్హులని చెప్పారు. పశువుల ఆరోగ్యం, భద్రతతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని అందిస్తోందన్నారు. అర్హులైన రైతులు ఆలస్యం చేయకుండా బీమా చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం కోసం సమీపంలోని పశువైద్యశాల సిబ్బందిని సంప్రదించాలని డాక్టర్ రాంబాబు సూచించారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర జిల్లా స్థాయి అవార్డు పొందిన పొదిలి శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్

అవార్డు అందుకున్న కమిటీ సభ్యులు దాసరి గురుస్వామి, వి రమేష్, కొల్లా సుబ్బారావు





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 3)

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర 2026 ఉత్తమ అవార్డుల కార్యక్రమంలో భాగంగా మార్కాపురం జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్ ఎంపికైనది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో గల శ్రీనివాస కళ్యాణమండపం నందు మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్ అధ్యక్షులు దాసరి గురుస్వామి, సెక్రటరీ వి రమేష్, ట్రెజరర్ కొల్లా సుబ్బారావు ను మెమెంటో, సర్టిఫికెట్లతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్ ను సందర్శించి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర గురించి తగు సూచనలు సలహాలు అందిస్తామని తెలిపారు. శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్ చైర్మన్ దాసరి గురుస్వామి, సెక్రటరీ వి రమేష్, కొల్లా సుబ్బారావు మాట్లాడుతూ శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్ డ్రైనేజీ విధానం, పరిసరాల పరిశుభ్రత నూరు శాతం పాటిస్తూ, మార్కాపురం జిల్లాలో స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైన ఏకైక అపార్ట్‌మెంట్ శ్రీ బాలాజీ అపార్ట్‌మెంట్ అని ఇలాంటి ఉత్తమ అవార్డు రావడం చాలా సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. గౌరవ అధ్యక్షులు వి సుబ్రహ్మణ్యం, సలహాదారులు తానికొండ వెంకట్రావు, అపార్ట్‌మెంట్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

పదవికి వీడ్కోలు.... వ్యక్తిత్వానికి వందనం....

ఉద్యోగ బాధ్యతలను, కుటుంబ బాధ్యతలను రెండు కళ్లుగా భావించిన మీరు... కుటుంబం కంటే విధికే ఎక్కువ సమయాన్ని కేటాయించి ఎన్నో సందర్భాల్లో మాకు దూరంగా ఉన్నారు. ఆ దూరం మాకు బాధ కలిగించినా... విధి పట్ల మీ నిబద్ధత, నిజాయితీ, అంకితభావం మీకు తెచ్చిన గౌరవం మాకు ఎంతో గర్వాన్ని కలిగించాయి.

"యార్లగడ్డ నరసింహారావు గారి తాలూకా" అని పేరు చెప్పగానే లభించే గౌరవమే...

మీరు మాకు అందించిన గొప్ప వారసత్వం. ఈ రోజు మీరు సబ్‌రిజిస్ట్రార్‌గా పదవీ విరమణ చేస్తున్నది ఉద్యోగ బాధ్యతల నుంచి మాత్రమే... మీ సహోద్యోగుల హృదయాల్లో మీరు సంపాదించుకున్న గౌరవం నుంచి కాదు.

మీ సేవలకు వందనం... మీ వ్యక్తిత్వానికి శిరస్సు వంచినమస్కారం...

మీ కొత్త జీవిత ప్రయాణానికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు..

ప్రేమతో....

యార్లగడ్డ కుటుంబ సభ్యులు




శ్రీ యార్లగడ్డ నరసింహారావు గారు

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

పేదల వైద్యానికి ఎమ్మెల్యే ఏలూరి భరోసా

సీఎంఆర్ఎఫ్ ద్వారా ఏడుగురికి రూ.3.09 లక్షల సాయం
ఏలూరి సిఫారసుతో మంజూరు
లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే





(షణ్ముఖ వెలుగు, మార్టూరు, అక్టోబర్ 3)
అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలిచారు. ఆయన సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మార్టూరు మండలానికి చెందిన ఏడుగురికి మొత్తం రూ.3,09,723 మంజూరయ్యాయి. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లబ్ధిదారులకు అందజేశారు. మార్టూరుకు చెందిన అవుల తిరుపతమ్మకు రూ.20,000, పల్లెపోగు రాణికి రూ.30,028, మండలపు సుబ్బారావుకు రూ.1,08,783, పబ్బిశెట్టి కృష్ణారావుకు రూ.34,500, కుంచాల కోటయ్యకు రూ.65,495, కెలవతి లక్ష్మీబాయికి రూ.10,000, బొల్లాపల్లికి చెందిన రావులపల్లి పవన్‌కు రూ.40,917 చొప్పున సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరైంది.

వీవీ జనరేటివ్ ఏఐ, ఎల్ఎల్ఎం ఇంజినీరింగ్ పై మూడు రోజుల హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 3)
శ్రీ హర్షిణి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (ఎస్‌హెచ్ఈసి)లో "జనరేటివ్ ఆండ్ ఎల్ ఎల్ ఎం ఇంజనీరింగ్" అంశం పై మూడు రోజుల పాటు హ్యాండ్స్ ఆన్ ఏఐ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు కళాశాల పూర్వ విద్యార్థిని జనీష్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి, విద్యార్థినులకు జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, డిప్లాయ్‌మెంట్‌పై ప్రాయోగిక అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌లో మొదటి రోజు ఫౌండేషన్స్ లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్ వంటి ప్రాథమిక అంశాలను విద్యార్థినులకు వివరించారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించుకునే విధానాలను ప్రాక్టికల్ ఉదాహరణలతో తెలియజేశారు. రెండవ రోజు ప్రాజెక్ట్ బిల్డింగ్ లో విద్యార్థినులు వాస్తవ ప్రపంచానికి ఉపయోగపడే ప్రాజెక్టులను స్వయంగా అభివృద్ధి చేశారు. ఏఐ ఆధారిత సాధనాలను వినియోగిస్తూ ఒక ఆలోచనను ప్రాజెక్ట్‌గా మార్చడం, ప్రాజెక్ట్ రూపకల్పన, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో హ్యాండ్స్-ఆన్ అనుభవాన్ని పొందారు. మూడవ రోజు ప్రాజెక్ట్ డె ప్లమెంట్‌లో విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టులను హోస్టింగ్, డిప్లాయ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు కాలేజ్ వెబ్‌సైట్ వంటి పలు వెబ్‌సైట్లను విజయవంతంగా రూపొందించి, డిప్లాయ్ చేశారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థినులు ఆలోచన నుంచి అభివృద్ధి, అభివృద్ధి నుంచి డిప్లాయ్‌మెంట్ వరకు ఒక పూర్తి ప్రాజెక్ట్‌ను స్వయంగా రూపొందించే ప్రాయోగిక అనుభవాన్ని పొందారు. దీంతో



జనరేటివ్ ఏఐ, ఎల్ఎల్ఎం టెక్నాలజీలపై వారి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మక ఆలోచనా విధానం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు మరింతగా అభివృద్ధి చెందాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విద్యార్థినులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా నేర్చుకోవడం ఎంతో అవసరం. ఇటువంటి హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్‌లు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడతాయి అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ జనరేటివ్, ఎల్ఎల్ఎంఎస్ వంటి ఆధునిక సాంకేతికతలు భవిష్యత్ విద్యా, పరిశ్రమ రంగాల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. విద్యార్థినులు కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవడం మాత్రమే కాకుండా, దాన్ని ఉపయోగించి వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను రూపొందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఈ వరిషాప్ ద్వారా విద్యార్థినులు ఆలోచన నుంచి ప్రాజెక్ట్ డిప్లాయ్‌మెంట్ వరకు పూర్తి స్థాయి అనుభవాన్ని పొందడం అభినందనీయం అని తెలిపారు. వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించడంలో రిసోర్స్ పర్సన్ జనీష్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సహకరించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని వివిధ ఏఐ ఆధారిత ప్రాజెక్టులను రూపొందించి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కార్యదర్శి, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, అలాగే కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థినులను ప్రోత్సహించారు. ఇందులో ఎన్ఎస్ఎస్‌కి సంబంధించిన పాత అకేషన్, ఎన్ఎస్ఎస్ సేవా భావం, సామాజిక బాధ్యత వ్యాఖ్యలను పూర్తిగా తొలగించి, వర్క్‌షాప్‌కు సరిపోయే ఏఐ నైపుణ్యాలు, పరిశ్రమ అవసరాలు, ప్రాక్టికల్ లెర్నింగ్, భవిష్యత్ టెక్నాలజీ అంశాలను కేంద్రంగా ఉంచారు.

పాడి రైతుల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 3)
ప్రతి గ్రామాన్ని స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి నక్కల వీరరాఘవులు అన్నారు. శనివారం మండలంలోని కడవకుదురు గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా మండల ఎంపిడిఓ కె ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఎపిఓ జె లక్ష్మీ దేవి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి నక్కల వీరరాఘవులు పాల్గొని వీబీజిఆర్ఏఎంజి పథకంలో భాగంగా గ్రామంలో నిర్మించనున్నచ 12 లక్షలవిలువచేసే క్యాటిల్ షేడ్స్ కు భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా నక్కల వీరరాఘవులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పాడి రైతుల సంక్షేమానికి, పశువుల సంరక్షణకు చంద్రబాబు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె ధనలక్ష్మి, జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి నక్కల వీరరాఘవులు, ఎమ్ఎస్ జిఓ శ్రీనివాసరావు, ఎపిఓ జె లక్ష్మీ దేవి, పంచాయతీ కార్యదర్శులు మల్లిశ్వరావు, ఎమ్ రమణ, కె ఉదయ్ భాస్కర్, సందు శ్రీనివాసరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.





పార్టీ విధేయుడు అల్లాబకాష్ 4వ వార్డులో సిసిరోడ్ల శంకుస్థాపనకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ఘన స్వాగతం

పెద్ద ఎత్తున ఫ్లెక్సీల ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 3)
పార్టీ విధేయుడిగా పేరున్న 4వ వార్డు కన్వీనర్ షేక్ అల్లాబకాష్ పొదిలి నగర పంచాయతీ పరిధిలో సిమెంట్ రోడ్లు, సైడు కాలువలకి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా మసీద్‌తోట వద్దకు ముఖ్య అతిథిగా హాజరైన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ఘన స్వాగతం పలికారు. రోడ్డు ప్రారంభం నుంచి తప్పెట్ల మోత, బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా ఫ్లెక్సీలతో ఆ వీధి మొత్తం పసుపుమయం చేశారు. ఈ సందర్భంగా వార్డు మొత్తం అల్లాబకాష్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తిప్పారు. ఈ సందర్భంగా 4వ వార్డులోని మహిళలు, పెద్దలు, యువకులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీ నిర్వహించారు. తరువాత ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బూత్ కన్వీనర్ షేక్ అల్లాబకాష్ ఇంటికి వీచ్చేసి అల్పాహార విందు స్వీకరించారు. పెద్ద ఎత్తున వచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో 4వ వార్డు మసీద్ తోటలో ఎన్నడు లేని విధంగా మున్సిపల్ వాటర్‌కి మూడు వైపులా నీరు వచ్చే విధంగా ఏర్పాటు చేశారని, లో వోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్న సమస్యను ఎలక్షన్‌కి ముందు ఇంటింటి ప్రచారంలో మసీద్ తోటకి వచ్చిన విగ్నేష్‌రెడ్డి మాట ఇచ్చిన ఒక సంవత్సరం లోపల రెండవ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను తీర్చారని ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా పట్టణంలో ఎక్కడ లేని



విధంగా ఇనుప కరెంటు, డ్యామేజ్ స్తంభాలు తొలగించి వాటి స్థానంలో 25 కొత్త కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి చాలా వరకు రెండు సంవత్సరాలలో ముఖ్యమైన



ఇబ్బందులు తొలగించారని ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. రిటైర్డ్ టీచర్ మదర్ వలి ఎమ్మెల్యేతో మాట్లాడుతూ మీ ఆదేశాలతో బూత్ కన్వీనర్ అల్లాబకాష్ ఈ పనులన్నీటిని తమకు చేసి పెట్టారని తెలియజేశారు. 4వ వార్డు ప్రజలు చూపిన అభిమానం పై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పొదిలి నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, ముల్లా ఖుద్దూస్, మెడికల్ బోర్డు మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణబాబు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌చార్జి వరికుంట్ల అనిల్ (పండు), మర్రిపూడి మాజీ ఎంపిపి వాకా వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి వెంకట నారాయణ ప్రతాప్, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మాజీ శివాలయం చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లికార్జున, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ కాలేషా, 4వ వార్డు కన్వీనర్ షేక్ అల్లాబకాష్, ముని శ్రీనివాసులు, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, తెలుగు యువత ఖాదర్, జమీర్, జిందు, రసూల్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డు ప్రజలు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.